క్లుప్తంగా

నేటి నుంచి మండలస్థాయి క్రీడా ఎంపికలు

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్ 14, 17 విభాగాలలో క్రీడా ఎంపికలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈవో బి.వెంకటరమణ, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి.గజేంద్ర సోమవారం తెలిపారు. 9న కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, బుధవారం వాలీబాల్, ఖోఖో, చెస్ పోటీల్లో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీలు మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు.

భూఆక్రమణపై చర్య తీసుకోండి

కవిటి: గొర్లెపాడు పంచాయతీలో ప్రభుత్వ భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణ స్వామి కోరారు. ఈ మేరకు సోమవారం కవిటిలో తహసీల్దార్ బి.మురళీ మోహనరావుకు వినతి పత్రం అందజేశారు. గొర్లెపాడు పంచాయతీ పరిధిలో చాలా వరకు ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు, సంతలు అక్రమణకు గురయ్యాయని తహసీల్దార్‌కు వివరించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


బొరివంకలో సర్పంచ్ శ్రీరాంప్రసాద్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్ తల్లి నారాయణమ్మ, ఆర్.కరాపాడులో ఎంపీటీసీ సభ్యురాలు బి.ఝాన్సీ తాతయ్య, మాజీ సభ్యుడు నర్తు నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఈ రెండు కుటుంబాలను జెడ్పీ చైర్‌పర్సన్ సోమవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నర్తు నరేంద్ర యాదవ్, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, మురపాల లచ్చయ్య, నర్తు జగన్నాధరావు, దట్టి అజయ్ ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


సుశీలను సత్కరిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సుశీల జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇటీవల అందుకున్నారు. దీంతో హెచ్ఎం భాస్కరరావు అధ్యక్షతన సోమవారం ఆమెను సిబ్బంది దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది ఆది, రాణి, దుర్గ, శైలజ, సౌజన్య, నాగమణి, పాఠశాల కోఆప్షన్‌సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరిపడా ఎరువులు సరఫరా చేయండి


తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కంచిలి: ఖరీఫ్ కాలంలో రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉన్న కారణంగా సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, పుక్కల ఆరెలమ్మ, మండల పార్టీ నేతలు అయినంటి లోకనాథం, జన్ని సోమేష్, పడుము వసంతరావు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు


షాపింగ్‌మాల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం రూరల్: గంజాయి, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై శ్రీనివాసరావు అన్నారు. ఇచ్ఛాపురం పట్టణ సమీపంలోని హరివిల్లు, సాయిసెంట్రల్ షాపింగ్‌మాల్‌లో గంజాయి వంటి నిషేధిత పదార్థాల నిల్వలపై సోమవారం డాగ్ స్క్వాడ్ సహాయంతో రూరల్ పోలీసులు సోదాలు నిర్వహించారు. నిషేధిత పదార్థాలు విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ప్రమాదం పొంచి ఉంది జాగ్రత్త!


బెండికొండ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కుంట

- భయపెడుతున్న కుంటలు
- మట్టి, కంకర మాఫియా తవ్వకాలు

వజ్రపుకొత్తూరు:

ప్రమాదకరంగా ఉన్న కుంటలు చిన్నారుల ప్రాణాలను చిదిమేస్తున్నాయి. గ్రావెల్, మట్టి మాఫియా చెలరేగిపోయి చెరువులు, కొండల వద్ద చేపడుతున్న అక్రమంగా తవ్వకాల వద్ద పెద్దపెద్ద కుంటలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వీటిలో నీరు చేరుతుంది. పిల్లలు స్నానాలు, ఆటలాడుకోవడానికి, బహిర్భూమి కోసం వెళ్లే సమయంలో నీటితో ఉన్న కుంటల వద్ద అప్రమత్తంగా లేకపోతే ఆపదలో పడే అవకాశాలు ఉన్నాయి. పలాస నియోజకవర్గంలో ఇలాంటివి చాలా చోట్ల దర్శనమిస్తున్నాయి. కొన్ని పాఠశాలలకు సమీపంలోనే ఉండగా మరికొన్ని ఆయా గ్రామాల దగ్గరలో ఉన్న చెరువుల వద్ద ఉన్నాయి. వజ్రపుకొత్తూరు మండలం బెండి కొండ సర్వే నంబర్ 1/1లో పెద్ద బొడ్డపాడు, కవిటగ్రహారం, తాడివాడ కొండ ప్రాంతాల్లో అక్రమార్కులు పెద్ద ఎత్తున గ్రావెల్ తరలించారు. ప్రస్తుతం అక్కడ భారీ స్థాయిలో కుంటలు ఏర్పడి వర్షం నీటితో ప్రమాదకరంగా ఉన్నాయి. పలాస మండలంలోని సూది, నెమలి కొండ ప్రాంతాలతో పాటు మందస మండలం నల్లబొడ్లూరు, రామక్రిష్ణాపురం, రాజాం తదితర ప్రాంతాల్లో కూడా ఈ పరిస్థితి ఉంది. ఈ ప్రాంతాల్లో గ్రావెల్ మాఫియా ఇష్టానుసారంగా కంకరను తరలించుకుపోతున్నా రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని సీతాపురం ఎర్ర చెరువులో గత ఏడాది రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున మట్టి తవ్వి తరలించగా.. అదులో పెద్ద కుంటలు ఏర్పడ్డాయి. ఇక్కడ నిత్యం గొర్రెలు కాపర్లు, విద్యార్థులు తిరుగుతుంటారు. ఇవి ప్రమాదకంగా ఉన్నాయి. ఉద్దానం గోపినాధపురం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలతో భారీస్థాయిలో గొయ్యిలు ఉన్నాయి అటుగా వెళ్లేవారు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం బారినపడతారనే ఆందోళన స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. అలాగే బెండి కొండ సర్వే నంబర్ ఒకటిలో కవిటగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. దానికి ఆనుకుని గ్రావెల్ తవ్వకాలు జరుగుతుండగా భారీ స్థాయిలో కుంటలు ఉన్నాయి. ప్రస్తుతం అవి ప్రమాదకరంగా ఉన్నాయి. లొద్దభద్ర, బ్రాహ్మణతర్లా, గొప్పిలి, వరదరాజపురం తదితర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలతో అక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున కుంటలన్నీ నీటితో నిండి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలతోపాటు పెద్దలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. గ్రావెల్ అక్రమ రవాణాను నిరోధించి తవ్వకాలు నిలిపివేస్తే గాని ప్రమాదాలు నివారించలేరు. దీనిపై రెవిన్యూ, మైన్స్ శాఖ అధికారులు దృష్టి సారించాలి. భవిష్యత్‌లో ప్రమాదకర సంఘటనలు దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

– దట్టి నాగేష్, కొండవూరు

చర్యలు తీసుకుంటాం

అనుమతులు లేకుండా గ్రావెల్, మట్టి తరలించి కుంటలు పెడితే చర్యలు తీసుకుంటాం. కొండ ప్రాంతం, పోరంబోకు స్థలాల్లో ఎవరైన తవ్వకాలు చేపడితే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలపై దృష్టి పెట్టాలని వీఆర్వోలకు ఆదేశాలు ఇచ్చాం. నేను కూడా ఈ ప్రాంతాలను పరిశీలిస్తాను.

– బి.సీతారామయ్య, తహసీల్దార్, వజ్రపుకొత్తూరు

అన్నదాత పోరుకు తరలిరండి: జెడ్పీ చైర్‌పర్సన్


పిరియా విజయ

కంచిలి: రైతన్నకు బాసటగా మంగళవారం పలాసలో నిర్వహించే 'అన్నదాత పోరు' నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8.30 గంటలకు సోంపేట మండలం కొర్లాం జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి పలాస పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొని.. అక్కడ నుంచి పలాస, ఇచ్ఛాపురం పార్టీ నాయకులు, మిగతా క్యాడర్, రైతులంతా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని నిరసన తెలియజేస్తామన్నారు. అనంతరం అధికారులకు ఎరువల కొరతపై వినతి పత్రం సమర్పిస్తామన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పలాస: వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పలాస: పలాసలో మంగళవారం ఉదయం పది గంటలకు జరుగునున్న ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు నిరసనగా చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస–కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సోమవారం పర్యటించి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. ముందుగా స్థానికంగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం అక్కడ నుంచి భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఆ తర్వాత పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బోర క్రిష్టారావు, మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, బెల్లాల శ్రీనివాసరావు, సవర సోమేశ్వరరావు, సనపల సింహాచలం, పోతనపల్లి హరిప్రసాద్, బోర భగవతిరెడ్డి, పి.వి.సతీష్‌కుమార్, మల్లా సురేష్‌కుమార్, దున్న సత్యం, తూముల శ్రీనివాసరావు, వాయలపల్లి శ్రీనివాసరావు, నర్తు వెంకటరమణ, బమ్మిడి సంతోష్‌కుమార్, అంబటి ఆనందరావు, బిరాటి వల్లభరావు, కొంచాడ రాజాశ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నదాత పోరుతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి


కోటబొమ్మాళిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


టెక్కలిలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలపై వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలిలో చేపడుతున్న అన్నదాత పోరు ర్యాలీ కార్యక్రమంతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వర్రావు కోరారు. సోమవారం టెక్కలిలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఉదయం తొమ్మిది గంటలకు అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహిస్తున్న ర్యాలీ కార్యక్రమానికి పార్టీ నాయకులతో పాటు రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తారు సత్యం, టి.కిరణ్, బి.గోపాల్, టి.జగ్గారావు, డి.కామన్న, బి.రాజేష్, జె.తిరుమలరెడ్డి, శ్యామలరావు, టి.లోకేశ్వర్రావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళిలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, ఎస్.వినోద్, పి.వెంకట్రావు, ఎస్.జనార్దన్‌రెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, కాళ్ల సంజీవ్, కవిటి రామరాజు, విశ్వనాథరెడ్డి, గణపతి పాల్గొన్నారు.

ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


నందిగాం: పెద్దతామరాపల్లి దుకాణం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నందిగాం: మండలంలోని రెండు ప్రైవేటు ఎరువుల దుకాణాలైన వెంకటేశ్వర పెర్టిలైజర్స్ నందిగాం, కొంచాడ సోమేశ్వరరావు పెర్టిలైజర్స్ పెద్దతామరాపల్లిలో సోమవారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్సై రామారావు, ఏఈఈ ప్రేమ్ కుమార్, మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మలు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను, స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే యూరియా నిల్వ ఉన్న సమయంలో తనిఖీలు చేయకుండా స్టాక్ అంతా అమ్మేసిన తరువాత తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం వలన ప్రయోజనం ఏమి ఉంటుందని పలువురు రైతులు నిట్టూర్చారు.

ఎరువుల పంపిణీపై రైతులు అసంతృప్తి


కవిటి: రైతుల వాదన వింటున్న తహసీల్దార్ మురళీమోహనరావు, ఏవో శ్రీదేవి

కవిటి: బొరివంక రైతుసేవా కేంద్రలో ఎరువుల పంపిణీ తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం రైతుసేవా కేంద్రానికి లారీ లోడు యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వీహెచ్ఏ కె.రత్నకుమారి పనితీరుపై తీవ్రస్థాయిలో రైతులు తహసీల్దార్ మురళీమోహనరావు, ఏఈ పి.శ్రీదేవి ఎదుట తమ అభ్యంతరాలను లేవనెత్తారు. సమయపాలన పాటించడం లేదని, తొలివిడత వచ్చిన ఎరువులు సక్రమంగా పంపిణీ చేయలేదని, స్టాక్ ఆర్ఎస్‌కేలో ఉన్నప్పటికీ కొందరు రైతులు వెళ్లి అడిగితే అవి అమ్మేశామని, ఇవ్వడానికి కుదరదని వీహెచ్ఏ రత్నకుమారి తెలపడంతో వారు ఆగ్రహానికి లోనయ్యారు. అమ్మేసిన ఎరువులు ఆర్ఎస్‌కేలో ఎందుకు ఉన్నాయంటే ఆమె నీళ్లు నమిలింది. పోనీ ఏరైతుకు అమ్మారో రికార్డులు చూపించమని రైతులు ఆమెను నిలదీశారు. ఆ విషయం కూడా వీహెచ్ఏ రత్నకుమారి నోట ఎటువంటి సమాధానం లేకుండా నిర్లక్ష్యంగా ఉండిపోవడంతో రైతులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. దీంతో తహసీల్దార్ మురళీమోహనరావు వీహెచ్ఏను మందలించి ఇకపై ఇటువంటి చర్యలకు పాల్పడితే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను నివేదిస్తానని హెచ్చరించారు.

రైతులకు యూరియా అందజేయాలి


సోంపేట: మామిడిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

సోంపేట: యూరియా సక్రమంగా సరఫరా కావడం లేదని రైతులు అధికారులను నిలదీస్తున్నారు. ఎకరానికి ఒక బస్తా యూరియా కూడా అందజేయకపోవడం దారుణమంటున్నారు. పలాసపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. పలాసపురం, మామిడిపల్లి, తాళభద్ర గ్రామాల్లో యూరియా పంపిణీని తహసీల్దార్ బి.అప్పలస్వా మి, వ్యవసాయ సహాయ సంచాలకులు భవానీశంకరరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో రైతులు మాట్లాడుతూ.. యూరియా సరిపడా అందడం లేదని, అందరి రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంతో పాటు, మందస మండలంలోని శ్రీశయన విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు సోమవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పురస్కారాలకు అర్హులన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో అభ్యసించి 500 మార్కులు సాధించిన వారు, ప్రైవేటు పాఠశాలలో చదివి 550 మార్కులు దాటిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ నెల 15వ తేదీలోగా సోంపేట సామాజిక ఆస్పత్రికి ఎదురుగా ఉన్న సాగర్ వెజిటబుల్ దుకాణంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

క్షీణించిన పారిశుద్ధ్యం

కంచిలి: బూరగాం పంచాయతీ కేంద్రంలో పారిశుద్ధ్యం క్షీణించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో సుమారు 50 కుటుంబాలు నివసించే ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇటీవల సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కానీ మురుగు, వర్షం నీరు పోవడానికి పక్కన డ్రైనేజీ నిర్మించలేదు. స్థానికుల వాడుక నీటితోపాటు వర్షం నీరు నిలిచిపోవడంతో రోడ్డంతా బురదమయమౌతోంది. పంచాయతీ యంత్రాంగానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

ఘనంగా అక్షరాస్యతా దినోత్సవం



కంచిలి మండలం బూరగాం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏ భాష నేర్చుకోవాలన్నా వర్ణమాలతోనే సాధ్యమవుతుందని, తద్వారా అది జీవిత మార్గాన్ని చూపుతోందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముప్పన సోమేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్లకార్డులపై నినాదాలు తయారు చేసి విద్యార్థులు ప్రదర్శించారు. -కంచిలి

సేవలకు గుర్తింపు



నందిగాం మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉత్తమసేవలు అందజేసిన కార్యకర్తలను అధికారులు సోమవారం సత్కరించారు. నాలుగు సెక్టార్లకు నలుగురు కార్యకర్తలను వారు చేసిన సేవలు, ప్రీస్కూల్ నిర్వహణ, ప్రజలతో మమేకమయ్యే విధానం, కొత్తవారికి ఇచ్చే సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకొని వీరిని ఎంపిక చేశారు. దిమ్మడిజోల సెక్టార్ పరిధిలోని కైజోల కార్యకర్త టి.క్రిష్ణవేణి, నందిగాం–1 సెక్టార్ నుంచి పెద్దతామారాపల్లి కార్యకర్త పి. మణెమ్మ, నందిగాం–2 సెక్టార్ పరిధిలోని మణిగాం కార్యకర్త కరగవలస జ్యోతి, కొండతెంబూరు సెక్టార్ పరిధిలో దేవుపురం కార్యకర్త హనుమంతు వెంకటనీరజలు ఉత్తమంగా ఎంపికయ్యారు. వీరిని టెక్కలి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పీవో విద్యా శతపతి దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారదాభాయ్, జలజాక్షి పాల్గొన్నారు. - నందిగాం

రైతు సేవా కేంద్రాల పరిశీలన



పలాస మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాలను తహసీల్దారు కళ్యాణచక్రవర్తి సోమవారం పరిశీలించారు. మాకన్నపల్లి గ్రామంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూరియాను తక్కువగా వాడమని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారని.. వారి సలహాలు రైతులు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో సింహాచలం, జనసేన పలాస నియోజవర్గం సమన్వయకర్త డాక్టరు దుర్గారావు, మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య పాల్గొన్నారు. -పలాస

గోతులైనా పూడ్చరా?


- శిథిలమైన సోంపేట ప్రధాన రహదారి
- వాహన చోదకుల అవస్థలు


సోంపేట సావిత్రి నర్సింగ్ హోమ్ సమీపంలో గుంతల్లో ఉన్న నీరు


బస్టాండు సమీపంలో గుంతల్లో వేసిన రాళ్లు

సోంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2025 సంక్రాంతి నాటికి రహదారులన్నీ బాగు చేసి ప్రజలకు ప్రయాణ సమస్యలను తీరుస్తామని పాలకులు వాగ్దానం చేశారు. అయితే దసరా పండుగ వస్తున్నా సోంపేట ప్రధాన రహదారి స్థితి మారలేదు. సోంపేట రోడ్డు జింకిబద్ర గ్రామం నుంచి కంచిలి ఫ్లెఓవర్ బ్రిడ్జి వరకు గుంతలమయంగా మారింది. సోంపేట పట్టణం నుంచి కవిటి– సోంపేట రహదారిని కలిపే ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి పక్కనుంచి వెళ్లే వన్‌వే రహదారి కూడా గోతులమయం కావడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోంపేట పట్టణానికి ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు చెందిన వందలాది మంది వివిధ పనుల నిమిత్తం నిత్యం వివిధ వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్లు బాగోకపోవడంతో అవస్థలు పడుతున్నారు. జింకిభద్ర గ్రామం నుంచి సోంపేట పట్టణంలోని సోమేశ్వర దేవాలయం వరకు అడుగుకో గొయ్యి దర్శనమిస్తుంది. జామి ఎల్లమ్మ, సోమేశ్వర దేవాలయ పరిసరాల్లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. బస్టాండు, సావిత్రి నర్సింగ్ హోం వద్ద గుంతలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిన్న వర్షం పడినా సావిత్రి నర్సింగ్ హోం సమీపంలో రహదారి వద్ద గోతుల్లో నీరు నిల్వ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు వద్ద గోతుల్లో పెద్ద రాయిలు వేసి ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలాగే సోంపేట–కవిటి ప్రధాన రహదారి నుంచి సోంపేట పట్టణానికి చేరుకునేందుకు ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి పక్కనుంచి ఉన్న రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోడ్లన్నీ గుంతల మయం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రోడ్లను బాగు చేస్తామని హామీలు గుప్పించిన కూటమి నాయకులు ఇప్పుడు రోడ్లను పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రయాణికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి కనీసం గోతులునైన పూడ్చాలని కోరుతున్నారు.


ఇబ్బందులు పడుతున్నాం



రోడ్లన్నీ గోతులమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. నెల రోజుల క్రితం తూతూ మంత్రంగా గోతులు కప్పి విడిచి పెట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారులు, నాయకులు స్పందించి రహదారి గుంతలు పూడ్చాలి.

– పొందూరు హేమచంద్రరావు, సోంపేట

ప్రభుత్వం పట్టించుకోదా?



సోంపేట ప్రధాన రహదారి గుండా నిత్యం వేలాది ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతల రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రభుత్వ పట్టించుకోవకపోవడం దారుణం వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలి.

– కోట రాజు, బెంకిలి

రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి

రహదారి గోతులు పూడ్చి ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లో పనులు ప్రారంభించి వాహనదారుల సమస్య పరిష్కరిస్తాం.

–దిక్కల విక్రమ్, ఆర్అండ్‌బీ ఏఈ, సోంపేట

రణభేరి జాతాను విజయవంతం చేయండి


రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సాయంత్రం జిల్లా కార్యదర్శి కె.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటీ పరిష్కారం చేయలేదన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు పరిమితం చేయడం దారుణం అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, జిల్లా కార్యదర్శి జి.రమేష్, రాష్ట్ర కౌన్సిల్ గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, జిల్లా అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వెంకటాచలం ఉన్నారు.